క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షుల నియామకం

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు మున్సిపాలిటీ, మండల అధ్యక్షుల నియామకం చేపడుతూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆమేరకు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని గంగాధర నెల్లూరు మండలానికి పూర్ణచంద్రారెడ్డి, కార్వేటినగరానికి శేఖర్‌రాజు, పాలసముద్రానికి తులసి యాదవ్, పెనుమూరు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీరంగరాజుపురం మణి, వెదురుకుప్పం పద్మనాభరెడ్డి, నగరి అసెంబ్లీ నియోజకవర్గంలో నగరి మున్సిపాలిటీకి రమేష్ రెడ్డి, నగరికి సుదర్శన్‌నాయుడు, పుత్తూరు మున్సిపాలిటీకి ఏకాంబరం, పుత్తూరుకు అన్న లోకనాథం, వడమాలపేటకు సుబ్రమణ్యంరెడ్డి, విజయపురానికి శివరాజు, నింద్రకు వేణుగోపాల్‌రాజును నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది.

మార్చి నుంచి మోటారు వాహన చట్టం అమలు

పాలసముద్రం: మార్చి ఒకటో తేదీ నుంచి మోటారు వాహనాల నూతన చట్టం అమలులోకి రానుందని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆయన గురువారం నూతన చట్టంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ఉల్లంఘనకు ప్రస్తుతం రూ.135 జరిమానా నిధిస్తున్నామని, నూతన చట్టం ప్రకారం రూ.వెయ్యి విధిస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే నూతన చట్టం ప్రకారం రూ.10 వేలు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. హెల్మెట్ వినియోగంపై పట్టణాలు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని, నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తున్నామని గుర్తు చేశారు. ఈ చలానాలు 90 రోజుల్లోపు చెల్లించని 141 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం



కార్వేటినగరం గాండ్లమిట్ట వద్ద కంటైనర్లు రావడంతో స్తంభించిన ట్రాఫిక్

కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరంలో భారీ వాహనాలతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. పూర్వం సంస్థానాధీశుల కాలంలో కార్వేటినగరంలోని వీధులు విశాలంగా ఉండేవి. చారిత్రక కట్టడాలతో చూపరులను ఆకట్టుకునేవి. క్రమేపీ వీధులు ఆక్రమణకు గురవుతూ 150 అడుగుల నుంచి 50 అడుగులకు కుచించుకుపోయాయి. దీనికి తోడు రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరగడంతో పాటు బెంగళూరు- శ్రీహరి కోటకు నిత్యం భారీ వాహనాలు ఈ మార్గం గుండా వెళుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు రైతులు శ్రీరంగరాజపురం మండలంలోని షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తరలిస్తుంటారు. దీంతో పెద్ద పెద్ద వాహనాలు, కంటైనర్లు వచ్చిన సమయంలో గాండ్లమిట్ట కూడలిలోని మలుపు వద్ద వాహనాలు తిరగలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతూ ఉంటారు. అక్కడ వాహనాలు సుమారు అరగంటకు పైగా ఇరుక్కుపోతూ ఉంటాయి. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలతో పాటు కనీసం పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. గతంలో ఎంతో మంది జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోండి

నగరి: నియోజకవర్గంలోని బలిజ కులస్తులు కాపు కార్పొరేషన్ సబ్సిడీ లోన్లను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి పీ.గోపి రాయల్, నగరి నియోజకవర్గ జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు ఎంవీ. బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 12వ తేదీ లోపు సచివాలయాల్లో కాపు కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో గానీ, సచివాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. బలిజ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవారు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.





కళ కళ.. వెల వెల

- నాడు మురిపించిన షాదీమహల్
- నాటి మాజీ మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితం
- నేడు భూత్ బంగ్లాను తలపిస్తున్న వైనం
- ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాష్ పనితీరుకు నిదర్శనం
- రూ.2.41 కోట్ల ప్రభుత్వ ఆస్తి నిర్వీర్యం

నాడు వైఎస్ఆర్ సీపీ పాలనలో పుత్తూరులో నిర్మించిన షాదీమహల్ శోభాయమానంగా అలరించింది. అయితే కూటమి పాలనలో అదే షాదీమహల్ దుమ్ముధూళి, ఎండిపోయిన మొక్కలు, పావురాళ్ల గూళ్లు, వాటి అరుపులతో భయానకంగా తయారైంది. కోట్ల రూపాయలతో నిర్మించిన షాదీమహల్ నేడు భూత్‌బంగ్లాలా తయారవడంపై ముస్లింలు మండిపడుతున్నారు. నాటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితంగా ముస్లింల చిరకాల స్వప్నం నెరవేరగా, నేటి ఎమ్మెల్యే భానుప్రకాష్ నిర్లక్ష్యం కారణంగా ముస్లింల 'షాదీ' ఆశలు అడియాసలవుతున్నాయి.

పుత్తూరు: నాటి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ పాలనకు నేటి కూటమి పాలనకు ఉన్న వ్యత్యాసానికి అద్దం పడుతోంది పుత్తూరులో నిర్మించిన అందమైన షాదీ మహల్ భవనం. ఆనాటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక శ్రద్ధ వహించి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడి ముసింల స్థితి గతులను వివరించి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా అనుమతించని విధంగా ఏకంగా రూ.2.41 కోట్లతో షాదీమహల్ నిర్మాణానికి అనుమతులు పొందారు. భారీ వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులను అందుకు తగ్గట్టుగా షాదీమహల్‌ను మరో తాజ్‌మహల్‌లా నిర్మించారు. అనతికాలంలోనే పనులు పూర్తి చేసుకోవడంతో గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన నాటి మంత్రివర్యులు ఆర్కే రోజా, డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషాతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. నగరి నియోజకవర్గంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేద ముస్లింలు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసుకోవడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన షాదీ మహల్ అనుకున్న లక్ష్యం నెరవేరకనే మసకబారడం దురదృష్టకరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే షాదీమహల్ మసకబారడం ప్రారంభమైంది. ఇప్పటి వరకు షాదీమహల్‌కు అధికారికంగా కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో టీడీపీ నాయకులే ఎమ్మెల్యే భానుప్రకాష్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మూసిన తలుపులు తెరవకపోవడంతో మహల్ మొత్తం దుమ్ము దూళితో నిండిపోయింది. లోపల ఏర్పాటు చేసిన వాల్ ఫ్యాన్లలో పావురాళ్ల గూళ్లు పెట్టేశాయి. కొన్ని అక్కేడే చనిపోతున్నాయి. పూలమొక్కలన్నీ ఎండిపోయాయి. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు సైతం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తి ఇలా నిర్వీర్యం అవుతుందడడంతో స్థానిక ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొంగలు పడ్డారు



షాదీమహల్‌లో బుధవారం రాత్రి తాళాలు పగులగొట్టి దుండగులు చొరబడ్డారు. లోపల విలువైన వస్తువులు అందుబాటులో లేకపోవడంతో ఎలాంటి ఆస్తి అపహరణ కాలేదు. అయితే సాయంత్రం వరకు సదరు తలుపులకు కొత్త తాళాలు వేయకపోవడం ఆశ్చర్యపరిచే విషయం. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే షాదీమహల్‌లో ఏర్పాటు చేసిన పలు విలువైన ఏసీలు దోపిడీకి గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక టీడీపీ నాయకులు షాదీమహల్ పర్యవేక్షణకు శ్రీకారం చుట్టాల్సింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



పుత్తూరులోని షాదీమహల్‌లో దొంగలు పడ్డట్టు తెలిసింది. అయితే ఎలాంటి వస్తువులు పోలేదు. షాదీమహల్ నిర్వహణకు నిధులు లేవు. అలాగే షాదీ మహల్ అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై నగరి ఎమ్మెల్యేతో మాట్లాడాం. త్వరలోనే కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిర్వహణ నిధులపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకొంటాను.

–కె.చిన్నారెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్, చిత్తూరు



ఫ్యాన్లలో పావురాల గూళ్లు



షాదీమహల్ ఆవరణ దుస్థితి



దుమ్ముధూళితో నిండిపోయిన మెయిన్ హాల్

ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

పాలసముద్రం: పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశించారు. ఆయన గురువారం పాలసముద్రం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున నాటు సారా విక్రయాలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయన్నారు. అలాగే ఇసుక, ఎర్రచందనం రవాణాను అరికట్టాలని సూచించారు. సరిహద్దులో ప్రత్యేనిఘా పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో పర్యటించి గొడవలు జరగకుండా చూడాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కి పరిమితం కాకుండా గ్రామాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్ఐ రమణరావ్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

గంగాధర నెల్లూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలను నియంత్రించవచ్చని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం కలిజవేడు పంచాయతీ కే నాసంపల్లి, తూగుండ్రం, అంబోదరపల్లి, దళితవాడ, మహాదేవ మంగళం గ్రామాల్లో పర్యటించారు. తూగుండ్రం పంచాయతీ, తోపుకుంట గ్రామంలో తాగునీటిని అందించాలని పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీపై అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. సాధ్యమైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అంబోదరపల్లి, మహదేవ మంగళ, దళితవాడ ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పాతపాళ్యం సర్పంచ్ కృష్ణమనాయుడు, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, కలిజవేడు సర్పంచ్ నీలావతి, పంచాయతీ కార్యదర్శులు కుమార్, మురళీ, లావణ్య రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పాలసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చెన్నై జానకిరామ్ ఆస్పత్రి వైద్యులు గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. డాక్టర్ అబాస్ రోగులను పరీక్షించారు. 55 మందిలో 12 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారిని చెన్నై ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి స్వగ్రామం చేరుస్తామని తెలిపారు.

బాలికల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం

పాలసముద్రం: యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తు కోసమే కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం రఘు, సూపర్‌వైజర్ సుశీల కిశోరి వికాస కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బీపీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వయసు పెరిగే కొద్ది శరీరంలో వచ్చే మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తినడం మానేయాలని సూచించారు. పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వివరించారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

విజయపురం: మండలంలోని పాతర్కాడు అరుంధతివాడ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇళ్ల స్థలాలతో పాటు, ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలని, ఇచ్చిన హామీ మేరకు పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో పోలీసులు

వెదురుకుప్పం: మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపరిచిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆయన గురువారం వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బ్రాహ్మణపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి ఈనెల 3వ తేదీ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో చవటగుంట సమీపంలో ద్విచక్రవాహనంలో వెళుతుండగా బ్రాహ్మణపల్లె దళితవాడకు చెందిన రజనీ కాంత్, మారేపల్లె దళితవాడకు చెందిన పవన్, చింతలగుంటకు చెందిన జ్యోతీశ్వర్ రెడ్డి ఆపారు. చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో దాడి చేశారు. శంకర్‌రెడ్డికి రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో మోహన్ మురళి పిలుపునిచ్చారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు పెరగడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల తగ్గుతుందన్నారు. అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, వైద్యాధికారులు బాలసుబ్రమణ్యంరెడ్డి, గిరి, గౌరి, ఎంఈవో అరుణాచలం రెడ్డి, సబర్మతి పాల్గొన్నారు.



నులిపురుగుల నిర్మూలన మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: నులి పురుగుల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాదేవి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. నులిపురుగుల నిర్మూలన కోసం మందులు పంపిణీ చేశారు. 10వ తేదీ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా రాతికూసాలను నాటేశారు!

- తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని తహసీల్దార్
- చెర్లోపల్లె గ్రామస్తుల ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఏళ్ల తరబడి రాకపోకలు సాగిస్తున్న రోడ్డులో కొందరు రాతికూసాలు నాటి, రాకపోకలకు అవరోధాలు కలిగిస్తున్నారని పెనుమూరు మండలం చెర్లోపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం దామోదరం, చెంగల్‌రాయులు, చిన్నస్వామి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పలు నిధులతో చెర్లోపల్లె రోడ్డును అభివృద్ధి చేశారన్నారు. అయితే ఈరోడ్డుపై గోపాల్‌నాయుడు, నరసింహులునాయుడు, తులసి నాయుడు, కోదండనాయుడు, జయచంద్రనాయుడు గత నెల 4న రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీని అడ్డంగా పెట్టారన్నారు. ఆపై రోడ్డులో ఎవరూ వెళ్లకుండా 10వ తేదీన రాతికూసాలను నాటారని, దీనిపై ప్రజా ఫిర్యాదుల వేదికలో గత సోమవారం ఫిర్యాదు చేస్తే కలెక్టర్ వెంటనే స్పందించి, వాటిని తొలగించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు తహసీల్దార్ ఏ చర్యలూ తీసుకోలేదని నిరసన వ్యక్తం చేశారు. రాతి కూసాలు నాటడం వల్ల గ్రామంలోని 18 కుటుంబాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాయని, ఇకనైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



చెర్లోపల్లెలో దారికి అడ్డంగా నాటిన రూతికూసాలు